www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 31 జనవరి 2024



వైఎస్ఆర్

సర్వేయర్ గురవయ్యను సస్పెండ్ చేయాలి

కడప అర్బన్ : ఖాజీపేట మండల సర్వేయర్ గురవయ్యను తక్షణమే సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పి. చంద్ర రెడ్డి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌డిఒ మధుసూదనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాజీపేట మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న గురవయ్య అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ధనార్జన ధ్యేయంగా అక్రమ సర్వేలు చేస్తూ నిజమైన లబ్ధిదారులకు నష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లంచం లేనిదే ఏ పనీ చేయని తెలిపారు. డబ్బులు ఎవరు ఎక్కువ ఇస్తే వారికి అనుకూలంగా సర్వేలు చేస్తూ, డబ్బు ఇవ్వకపోతే తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని పేర్కొన్నారు. ఖాజీపేట మూడు రోడ్ల కూడలిలో నిలబడి ఎవరిని అడిగినా గురవయ్య అవినీతి కథలు కథలుగా చెబుతారని తెలిపారు. తక్షణమే గురవయ్యను సస్పెండ్ చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై నిరసన

- పనిచేయని బాడీ ఫ్రీజర్
- మృతదేహంపై చీమలు
- పోస్టుమార్టం అలసత్వంపై బంధువుల ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సిబ్బంది నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆస్పత్రి ముందు బాధితులు ఆందోళన చేపట్టారు. వివరాలు.. జమ్మలమడుగు పట్టణంలోని బీసి కాలనీకి చెందిన బడిగింజల దేవి (16) అనే బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. మంగళవారం ఉదయం వరకు పోస్టుమార్టం నిర్వహించలేదు. పోస్టుమార్టం గదిలో ఫ్రీజర్ లేకపోవడంతో బయట నుంచి తెప్పించారు. మంగళవారం ఉదయం మృతదేహానికి చీమలు పట్టి ఉండడంతో బాధితులు గమనించి ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించారు. మృతదేహాన్ని పెట్టిన ఫ్రీజర్ పనిచేయలేదని, మృతదేహంపై చీమలు ఉంటే గమాక్సిన్ పౌడర్ చల్లాలని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ఆగ్రహించిన బంధువులు ఆసుపత్రి ఆవరణలో ఆందోళన చేపట్టారు. మృతదేహాన్ని ఎసిలో పెట్టకుండా సిబ్బంది నిర్లక్ష్యం చేశారని మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వ్యవరిస్తున్నారని మృతదేహానికి చీమలు పట్టడంతో ఆవేదనతో సిబ్బందిని అడిగినందుకు తమపైనే ఆస్పత్రి సిబ్బంది దాడికి దిగినట్లు బాధితులు వాపోయారు. ఫ్రీజర్ పనిచేయదేదని తెలిసినకూడా నిర్లక్ష్యం మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో పెట్టడం మృతి చెందిన బాలిక చుట్టూ చీమలు పట్టాయని చెప్పారు. ప్రశ్నించినందుకు పోలీసులకు ఫోన్ చేసి బెదిరించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫీక్ పాషా మాట్లాడుతూ ఫ్రీజర్ పనిచేయకపోవడంతో ఘటన జరిగిందని దీనిపై సమగ్రంగా విచారణ చేపడతామని తెలిపారు.



ఆస్పత్రిలో బాలిక మృతదేహం

నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని, ఆస్పత్రిలో ప్రధానమైన బాడీ ఫ్రీజర్, జనరేటర్ వంటివి లేవని వాటిని ఏర్పాటు చేయకపోవడం దారుణమని డివైఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకుండా అలసత్వం సిబ్బంది చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరిండెంట్‌కు వినతి పత్రం అందజేశారు.

వైసిపితోనే మహిళా ఆర్థిక స్వావలంబన



మెగా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప అర్బన్

జగనన్న ప్రభుత్వంలోనే మహిళా ఆర్థిక స్వావలంభన సాధ్యమైందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక శంకారపురంలోని స్కౌట్ హాల్ ఆవరణలో నగరపాలక సంస్థ, మెప్మా వారి ఆధ్వర్యంలో 4వ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి దృష్టిలో ఉంచుకుని పేద, నిరుపేదలకు నవరత్నాలు కార్యక్రమం ద్వారా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.బి. అహమ్మద్ బాషా, అఫ్జల్ ఖాన్, జయచంద్రా రెడ్డి, తోట కృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య, కార్పొరేటర్లు షేక్. మహమ్మద్ షఫీ, రామకృష్ణారెడ్డి, నాగేంద్ర, మల్లికార్జున, బండి ప్రసాద్, సూర్యనారాయణ రావు, త్యాగరాజు, సుబ్బా రెడ్డి, కిరణ్, రామ లక్ష్మణ్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు. **దువ్వూరు :** మండలంలోని 881 స్వయం సంఘాలకు గాను రూ. ఆరు కోట్ల మెగా చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగం రెడ్డి తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి సమన్వయ కార్యకర్త నాగిరెడ్డి ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ కాణాల జయచంద్రరెడ్డి, జడ్‌పిటిసి మెరువ కృష్ణయ్య, జిల్లా వ్యవసాయ సలహాదారులు కానాల ఓబుల్ రెడ్డి, వి.వి. స్వామి, హరిహర నాథరెడ్డి, ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి, మండల కన్వీనర్ చిరాకిబాషా, ఏరియా కో- ఆర్డినేటర్ లావణ్య, వెలుగు సిసి శ్రీధర్, మండల అధికారులు పాల్గొన్నారు. **మైలవరం :** ప్రతి మహిళా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటూ లక్షాధికారి చేయడమే ముఖ్యమంత్రి వైయస్ జగన్ లక్ష్యమని జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ ఆసరాకు సంబంధించి 562 స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ. 4.64 చెక్కులను ఎమ్మెల్యే, ఎంపిపి సావిత్రమ్మ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మహాలక్ష్మి, లక్ష్మమయ్య , తహశీల్దార్ తిరుపతయ్య, జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మండల వైసిపి నాయకులు వినయ్ కుమార్‌రెడ్డి, నారపురెడ్డి శివ, గురివిరెడ్డి, వెలుగు సిసిలు, సభ్యులు పాల్గొన్నారు. **వల్లూరు :** మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే రవీందర్‌నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గంగాయపల్లి ఆదర్శ పాఠశాలలో నాలుగవ విడత ఆసరా పథకం మెగా చెక్కును ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జున్ రెడ్డితో కలిసి మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో 560సంఘాలకు సంబంధించి 2,343 మంది మహిళలకు రూ. 5 కోట్లు మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వెంకటసుబ్బయ్య, మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, స్టేట్ యూత్ జనరల్ సెక్రెటరీ ఇంది రెడ్డి శంకర్ రెడ్డి, మాజీ ఎంపిపి శివకుమార్ రెడ్డి, మండల ఉప అధ్యక్షులు గంగయ్య, ఎంపిడిఒ జయశ్రీ, ఇఒపిఆర్‌డి ప్రసాద్, ఎపిఎం శైలజా దేవి, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** ప్రతి మహిళా ఆర్థికంగా ఎదిగి లక్షాధికారి అవ్వాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని, ప్రతి మహిళ స్వశక్తితో ఎదగాలని మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మైదుకూరు రోడ్డులోని మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణంలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను అందజేశారు. మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టి పల్లె నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చారని, మహిళల ఆర్థిక పురోభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి, మండలం పరిషత్ కో - ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, వైసిపి నాయకులు ఇరగంరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు రాఘవరెడ్డి, గోపి రెడ్డి పెద్దిరెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బైండోవర్ కేసుల నమోదుపై విచారించాలి
- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఎన్నికల దృష్ట్యా పోలీసులు నమోదు చేసిన బైండోవర్ కేసులపై విచారణ జరిపించాలని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజును మంగళవారం టిడిపి ఎమ్మెల్సీ రాంగో పాల్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఎపిలో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలకు విఘాతం కలిగించే వారిపై బైండోవర్ కేసుల నమోదుకు ఆదేశించిందన్నారు. పోలీసులు మాత్రం అధికార పార్టీ నాయకులకు లొంగి, ప్రతిపక్ష పార్టీ నాయకులపై, కార్యకర్తలపై అక్రమ బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. పోలీసులు సెక్షన్ 107 సి ఆర్‌పిసి నమోదు చేయాలంటే గతంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిన వారినిపై తహశీల్దార్లకు వారి వివరాలను నివేదించాలన్నారు. పోలీసులు మాత్రం అటువంటి నియమ, నిబంధనలు పాటించకుండా, అధికారం చేతుల్లోకి తీసుకుని ఇష్టానుసారంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. దౌర్జన్యం, దాడులు చేసేది అధికార పార్టీ నాయకులే అన్నారు. కోడి పందెం రాయుళ్లకు, తాగుబోతులకు ఎన్నికలకు ఏమి సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. పులివెందుల అభివృద్ధికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసిన అభివృద్ధి కనపడలేదన్నారు. 214 కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటుకు కేంద్రం నుంచి నిధులు వచ్చాయన్నారు. చెక్ డ్యాములు పూర్తి కాలేదన్నారు. ఎంతమందికి గన్‌మెన్లు కేటాయించారని, ఎంతమందికి తుపాకీ లైసెన్సులు ఇచ్చారని, సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం ఇవ్వాలని అడిగిన ఇంతవరకు తనకు సమాచారం ఇవ్వలేదన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా మంగళవారం బొజ్జవారిపల్లె గ్రామంలో వివిధ అంశాలపై పైన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ శుభ్రత-ఆరోగ్యం అందానికి రెండు కళ్ళు, దుమ్ము, ధూళి నిండిన ప్రపంచంలో పరిశుభ్రత ఒక తాజా పరిమళమన్నారు. ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితానికి పరిశుభ్రత తొలిమెట్టు అన్నారు. ఎంత మంచి ఆహారమైనా పరిశుభ్రంగా లేకపోతే అనారోగ్యానికి దారితీస్తుందన్నారు. ర్యాలీలో గ్రామ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, స్కూల్ ఇన్‌ఛార్జి ఉపాధ్యాయులు భద్రయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి,గ్రామ పెద్దలు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి - కడప

ఇటీవల బెంగళూరులోని యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో వైఫై రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరవ వైఫా కప్ త్వేకాండో పోటీలలో కడప నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను మంగళవారం కడప నగరం మారుతి నగర్‌లోని తన కార్యాలయంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో కడప నియోజకవర్గానికి చెందిన తేక్వాండో మాస్టర్ జంశీర్ వద్ద శిక్షణ పొందిన క్రీడాకారులు షైక్ హలీమా సాధియా, వివిధ విభాగాల్లో 4 (గోల్డ్ మెడల్స్), రాకేష్ అండర్ 55 విభాగల్లో 2(గోల్డ్ మెడల్స్), షైక్ షిఫా, షైక్ బీబీ అయిషా, జోహా,(గోల్డ్ మరియు సిల్వర్) మెడల్స్ సాధించడం విశేషం అన్నారు. కడప నియోజకవర్గానికి చెందిన విద్యార్థిని, విద్యార్థులు క్రీడల్లో మరింత వేగంగా రాణించి ఉన్నత స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడాకారుల తల్లితండ్రులు,మాస్టర్లు పాల్గొన్నారు.

టిడిపిలోకి 100 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని 32వ డివిజన్ రాజారెడ్డి వీధిలో మంగళవారం తెలుగుదేశం పార్టీలోకి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో 100 కుటుంబాలు చేరగా, వారిని టిడిపి పొలిటి బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాధవి పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మహిళలు, యువత కోరుకుంటున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో యువత ముందుండి తెలుగుదేశం పార్టీకి అఖండ విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో పథకాల ఫలాలు అందరికీ అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ముందుగా ద్వారకా నగర్ నుంచి యువత పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ ద్వారా రాజారెడ్డి వీధి చేరుకుని శ్రీనివాసరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

వైసిపిలోకి పలువురు..

ప్రజాశక్తి-దువ్వూరు

గ్రామానికి చెందిన కటారి రాఘవేంద్ర కటారి రఘు, తన అనుచరులు మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న పథకాలను చూసి వారు పార్టీలో చేరామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి సమన్వయ కార్యకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఎంపిపి కానాలీ కానాల జయచంద్ర రెడ్డి, ఇరంగం రెడ్డి గోపాల్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జడ్జి

కడప : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని చిన్న చౌక్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 'న్యూ మాడ్యూల్' లీగల్ సర్వీసెస్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015, ట్రాఫికింగ్, కమర్షియల్ లైంగిక దోపిడీ బాధితులు పథకం, 2015 ల గురించి వివరించారు. అనంతరం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, డిస్టిక్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, లేబర్ డిపార్ట్మెంట్, వన్ స్టాప్ సెంటర్, శిశు గృహ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను జడ్జి, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పారా లీగల్ వాలంటీర్లు, ఎన్జీవోలు సందర్శించారు. కార్యక్రమంలో డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్, దిశా సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మురళి, గవర్నమెంట్ చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ వీరయ్య, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాసులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు యాస్మిన్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మాధవి లత, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, పారా లీగల్ వాలంటీర్లు డాక్టర్ వర కుమార్, టీచర్స్, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోస్టులు చూపించకపోవడం అన్యాయం

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలలోని అధ్యాపక పోస్టుల భర్తీకి ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఉన్నతాధికారులు ఉర్దూ అధ్యాపకల పోస్టులను పూర్తిగా మరిచిపోయారని, ఒక్కటి కూడా ఉర్దూ డిగ్రీ లెక్చరర్ పోస్టు చూపకపోవడం చాలా అన్యాయమని రూట లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వసివుల్ల బక్తియారి సాహెబ్ అన్నారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వసివుల్ల బక్తియారి సాహెబ్ మాట్లాడుతూ రాష్ట్ర రెండో అధికార భాషా ఉర్దూ నిర్లక్ష్యానికి గురికాకుండా చూడాలని కోరారు. వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నోటిఫికేషన్‌లో ఉర్దూ అధ్యాపక పోస్టుల చేరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర అకడమిక్ వింగ్ కన్వీనర్ షహబుద్దిన్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ హర్షణీయం

వేంపల్లె : భవిత కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయడం హర్షణీయమని ఎంఇఒస్టాలిన్ ఐజాక్ చెప్పారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలోని విద్యార్థులకు వేంపల్లెలోని చైతన్య మహిళ మండలి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 మంది విద్యార్థులకు ఆదుకోవాలనే ఉద్దేశంతో 30 మంది చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. దాతల సహకారంతో ఎన్నడూ మరవలేనిది అన్నారు. చైతన్య మహిళా మండలి అధ్యక్షురాలు రామాంజనమ్మ మాట్లాడుతూ చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే టంగుటూరి వెంకటనారాయణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి నిర్మలా, వీరాంజనేయులు భవితా కేంద్రానికి మిక్సీని అందజేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు నాగన్న, చైతన్య మహిళా మండలి సెక్రటరీ ప్రసన్న కుమారి, హాస్టల్ వార్డెన్ మాణిక్యరావు, ఐఇఆర్టీ యశోధ, సుజాత, ఫిజియేథేరఫి ఆనంద్, సిఆర్పిలు నాగరాణి, కళ్యాణి, సూర్య కుమారి, ఎంఐఎస్ అబ్దుల్ ఖాదర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షులుగా రామాంజనేయులు

వేంపల్లె : భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా బి. రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ప్రొద్దుటూరులో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభల్లో వేంపల్లెకు చెందిన బి. రామాంజనేయులును జిల్లా అధ్యక్షులుగా ఎన్నిక కావడం జరిగినట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ప్రతి కార్యక్రమంలో వేంపల్లె భవన నిర్మాణం సంఘం కార్మికులు ఉత్సాహంగా చేస్తుడడంతో జిల్లా కార్యవర్గంలో వేంపల్లెకు సముచిత స్థానం కల్పించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా బాలాజీ, కోశాధికారిగా నాగేశ్వరరావు, జిల్లా సంయుక్త అధ్యక్షుడుగా ఓబులేసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేంపల్లెకు చెందిన నలుగురికి పదవులు రావడంపట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

'పెయ్య దూడల'తో అధిక లాభాలు

ప్రజాశక్తి -ఖాజీపేట

పెయ్య దూడల పథకం వల్ల అధిక ఆదాయ లాభాలు కలవని రాష్ట్ర పశు ఘనాభివృద్ధి సంస్థ, అదనపు సంచాలకులు డాక్టర్ రజినీకుమారి తెలిపారు. మంగళవారం మండలం పరిధిలో లోని త్రిపురవరం గ్రామంలో పెయ్యి దూడలపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. లింగ నిర్ధారణ వీర్యం ద్వారా 90శాతం ఆడ దూడలు జన్మిస్తాయని, రైతులు అధిక పాల ఉత్పత్తులు పొందవచ్చని వివరించారు. పశు పోషకులు ఆర్థికంగా ఎదగడానికి ఈ పథకం ఉపయోగం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో పశు ఘనాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణ అధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ శివరామిరెడ్డి, ఆంజనేయ కొట్టాలు పశు వైద్య అధికారి డాక్టర్ ఎన్. బాబు రామచంద్ర, గోపాల మిత్ర రవి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సురక్షిత ప్రయాణానికి భద్రతా చర్యలు
ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్

ప్రజాశక్తి - కడప

విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణం అందించుటలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ అన్నారు. నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం భద్రత, విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణం కల్పించడం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు, విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణం అందించుటలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి బస్సు డ్రైవర్లు, విద్యా సంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రుల కమిటీలు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. తప్పనిసరిగా ప్రతి విద్యా సంస్థ ఈ నియమావళి తూచా తప్పకుండా పాటించి విద్యార్థులకు సురక్షిత ప్రయాణం కల్పించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భద్రత నియమాలు పాటించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలు సెల్ ఫోన్‌లకు బానిసలు కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిప్యూటి ఎస్ఇ మాధవి, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఎడి దేవరాజ్, మోటార్ వాహనాల తనిఖీ అధికారులు ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న, ట్రాన్స్‌ఫోరుట, హోమ్‌గార్డులు, ప్రయివేట్ విద్యాసంస్థల కమిటీ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, ఫైర్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

జనం లేక జగన్ సభలు వెలవెల

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నిర్వహిస్తున్న రా కదలి రా సభలకు రాష్ట్రవ్యాప్తంగా జనం పోటెత్తుతున్నారని, జిల్లాలు, ప్రాంతాలకు సంబంధం లేకుండా చంద్రబాబు సభలను జనం విజయవంతం చేస్తున్నారని గన్ నిర్వహిస్తున్న సిద్ధం సభలు జనం లేకవెల వెల లాడుతున్నాయని టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి హరి ప్రసాద్ అన్నారు. మంగళవారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం ఉపయోగించి జనాన్ని తరలించాలని ప్రయత్నించిన ఫలితం లేదని చెప్పారు. చంద్రబాబుపై జగన్ రెడ్డి పెట్టిన అక్రమ కేసుల్లో సుప్రీంకోర్టులో తీర్పులు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టని పేర్కొన్నారు. ప్రజలు జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే ఆయనకు అర్థమైందని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పిరయ్య, సుబ్బారెడ్డి, అమీర్‌బాషా, ఖాసీం పాల్గొన్నారు.

టిడిపికి ఓటు వేసి గెలిపించాలి : బిటెక్ రవి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పట్టణంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలో రజక కాలనీ, చిన్న కొండారెడ్డి కాలనీ జయమ్మ కాలనీ, సుజాత థియేటర్ వీధి తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గృహంలోని మహిళలకు తెలుగుదేశం పార్టీ చేపడుతున్నటువంటి ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంచారు. ఆయన సతీమణి లతారెడ్డి మహిళల కోసం టిడిపి చేపట్టబోయే పథకాల గురించి వివరించి రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పనిల్ కుమార్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, కాశీం వల్లి ,మహబూబ్ బాషా, వెంకటాపురం లక్ష్మీదేవి, రమీజా, పీరమ్మ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులను అభిమానించాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

సమాజంలోని కుష్టువ్యాధిని వ్యతిరేకించాలనే తప్ప వ్యాధిగ్రస్తులను కాదని 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైఎంఆర్ కాలనీలో స్పర్షకుష్టువ్యాధి అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేసి అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కుష్టువ్యాధిగ్రస్తులు తాము తీసుకునే మందులతో పాటు సమాజం చూపించే ఆదరాబిమానాలతో త్వరలో కోలుకుంటారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శివశంకరయ్య, సిఒ సుబ్బారెడ్డి, సుబ్బయ్య రామచంద్రారెడ్డి, ఆశాలు, స్థానికులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి - కడప

పిసిసి చైర్మన్ షర్మిలమ్మ ముఖ్యమంత్రి జగన్ అన్న అని కూడా చూడకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగవని జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు పైడిపల్లి కిషోర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపి పిసిసి చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి షర్మిలమ్మ తన అన్న ముఖ్యమంత్రిని టార్గెట్ చేసినట్లుగా కనిపిస్తుందని అన్నారు. ప్రతిరోజు ముఖ్యమంత్రిపై పలు ఆరోపణలు గుప్పిస్తూ వస్తున్నారు అని అన్నారు. వైఎస్ కుటుంబాన్ని ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళు తాగించిన కాంగ్రెస్ పార్టీలోకి షర్మిలమ్మ చేరిపోవడం ప్రజలకు ఎవరికీ ఇష్టం లేదన్నారు. ఇప్పటికైనా షర్మిలమ్మ మనసు మార్చుకుని ముఖ్యమంత్రి జగన్‌పై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన కోరారు.

రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం చెల్లించకుండా తీవ్ర మనోవేదనకు గురిచేయడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు కడప కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు.మంగళవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిలే నిరాహార దీక్షలు ద్వారా ప్రభుత్వ దుర్మార్గపూరిత మొండి వైఖరిని ఎండగడతామని తెలిపారు. ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన ఆర్థిక బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఉపాధ్యాయుల పట్ల ఇలాంటి వైఖరి మంచిది కాదని చెప్పారు. ప్రభుత్వం ఇలాంటి వైఖరి కొనసాగిస్తే భవిష్యత్తులో తగిన బుద్ధి చెప్తామన్నారు. ఉపాధ్యాయులందరూ రిలే దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు వీరనారాయణ, అబ్దుల్ గని, చంద్రశేఖర్, సమీర్ బాషా, గోపినాథ్, జి మ.వెంకట సుబ్బయ్య, సలీం బేగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

కల్యాణ మండపానికి స్థలం వితరణ
ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నాయి బ్రాహ్మణుల కళ్యాణ మండప నిర్మాణం కోసం సుమారు రూ. 1.65 లక్షలు విలువ చేసే 33 సెంట్లు భూమిని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వితరణ చేసి, వారికి మంగళవారం స్థల పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థల ప్రాంగణమైన కామనూరు, చెన్నంరాజుపల్లి వద్దనున్న ప్రకృతి నగర్‌లో నాయి బ్రాహ్మణులు వారి సామాజిక వర్గ నాయకులు పెద్ద ఎత్తున బహిరంగ సభను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే రాచమల్లును ఘనంగా సత్కరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లు హ్యాట్రిక్ సాధిస్తారని, తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేస్తామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ తను వంతు సహాయ సహకారంగా నాయి బ్రాహ్మణులకు భూమిని అందజేశానని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, టిటిడి పాలకమండలి సభ్యుడు యానాదయ్య, ఎంపిపి శేఖర్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, మహిళా అధ్యక్షురాలు కోనేటి సునంద, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, నాయి బ్రాహ్మణ కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కృషి చేస్తుందని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు రఘురామరాజు అన్నారు. మంగళవారం కార్మిక బస్సు యాత్ర కడపకు వచ్చిన సందర్భంగా ఆర్‌టిసి బస్టాండ్ వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపిని అధికారంలోనికి తీసుకొచ్చేందుకు కార్మికులు కృషి చేయాలని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం కార్మికులను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జింక శీను మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఎన్టియుసి ఆర్టీసీ కార్మిక పరిషత్ అధ్యక్షులు ఎబిజె రెడ్డి, చంద్రశేఖర్, అచ్చున్న, యానాది రాజు, లక్ష్మీనారాయణ, శేఖర్ పాల్గొన్నారు.

జాతీయ రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

పులివెందుల టౌన్ : 35వ జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలలో భాగంగా పట్టణంలోని గాంధీ విగ్రహం సర్కిల్ నుంచి కొత్త ఆర్టీసీ బస్టాండ్ వరకు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'మద్యం సేవించి వాహనాలు నడపరాదు.. రాష్ డ్రైవింగ్ సిగ్నల్ జంప్ చేయకూడదు.. సీట్ బెల్ట్ ధరించండి భద్రంగా గమ్యం చేయండి.. సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనం నడప నడపడం ప్రమాదకరం' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పులివెందుల రూరల్ సిఐ బాల మద్దిలేటి, ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ, అర్బన్ ఎస్ఐ హుస్సేన్‌బాషా, ఆర్‌టిసి అధికారి శ్రీకాంత్, ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ కానిస్టేబుల్ మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

దొంగ ఓట్లను తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దొంగ ఓట్లను తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలని టిడిపి ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.వి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు టిడిపి కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జులు , యూనిట్ ఇన్‌ఛార్జుల ఇంటిగ్రేటెడ్ శిక్షణ సమావేశం ముఖ్య అతిథి నియోజకవర్గ పర్యవేక్షకులు ఎ.వి. ఆర్. ప్రసాద్ సమక్షంలో నిర్వహించారు.రాబోయే ఎన్నికల నిర్వహణ అంశంపై క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని, కొత్త ఓట్లు చేర్పించాలని, డబుల్ ఎంట్రీలను, దొంగ ఓట్లను గుర్తించి వాటి తొలగింపునకు అధికారులపై ఒత్తిడి తేవాలన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్తా ఎన్నికల యుద్ధంలో సైనికుడిగా పని చేయాలని సూచించారు. కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక పదవులతో సత్కరిస్తుందని చెప్పారు. ప్రజలకు మేలు జరగాలంటే ఈ రాక్షస పాలన నుంచి విముక్తి పొందేందుకు కష్టపడి పనిచేయాలని చెప్పారు. సమావేశంలో క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు మరోసారి ఆదరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- జమ్మలమడుగు

దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కాని పథకాలు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన ప్రజలకు అందించారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జమ్మలమడుగు పట్టణంలోని మూడవ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వ తాతలకు ప్రతినెల 1న పెన్షన్ అందించిన ఘనత సిఎంకు దక్కుతుందన్నారు. గ్రామ, వార్డు ప్రజలు తమ సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రజలు చెప్పులు అరిగిపోయేలా తిరుగుతూ ఉన్నప్పటికీ ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. జగనన్న సురక్ష ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకునేందుకు వీలుగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీని మరోమారు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, హస్తకళల చైర్ పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, డైరెక్టర్ మార్బుల్ శీను, బడిగింజల చంద్రమౌళి, కొండారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపి అబద్ధపు హామీలకు స్వస్తి పలకాలి : భూపేష్‌రెడ్డి

మైలవరం : రాబోవు ఎన్నికల్లో వైసిపి అబద్ధపు హామీలకు స్వస్తి పలకాలని జమ్మలమడుగు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని తలమంచిపట్నం, కోన అనంతపురం గ్రామాలలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి పేద ,మధ్యతరగతి వారిని నిరుద్యోగులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఇంటి పన్ను, విద్యుత్, బస్సు ఛార్జీలు పెంచేశారన్నారు. స్టీల్ ఫ్యాక్టరీ, ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ, సోలార్ ప్రాజెక్టు, కట్టకుండా నిరుద్యోగులకు మోసం చేశారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతూ ఉంటే వారందరికీ ఒక్కొక్కరికి రూ. 15వేలు, ఆడబిడ్డ నిధి ద్వారా 18 ఏళ్ల నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ. 1500 ఇస్తారని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాత్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, చిన్న సంజీవ, శ్రీనివాస నాయుడు ,బాబుల్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** మండలం పెదనపాడు గ్రామంలో బాబుష్యూరిటీ –భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి, తల్లి చదిపిరాళ్ళ సరస్వతి నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు తిరుగుతూ మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా, తన కొడుకును ఎమ్మెల్యేగా గెలిపిం చాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండలం తెలుగుదేశం పార్టీ బాధ్యులు మోహన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మధుసూదన్ రెడ్డి,రామకృష్ణారెడ్డి, నిత్య వర్ధన్ రెడ్డి,మహేష్ రెడ్డి, రమణయ్య,బాల గంగిరెడ్డి, రమణారెడ్డి, రాముడు,తెలుగు దేశం పార్టీ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.

'పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్నా.. నీరు సరఫరా చేయలేదు.!'

ప్రజాశక్తి - వేంపల్లె



మాట్లాడుతున్న అబ్దుల్, తెలంగాణ వలి

సొంత డబ్బులు ఖర్చు చేసుకొని పైప్‌లైన్ వేసుకున్నా తాగునీటిని పంచా యతీ సిబ్బంది సరఫరా చేయడం లేదని ఇంటి యజమాని అబ్దుల్, తెలంగాణ వలి అవేదన వ్యక్తం చేశారు. మంగలవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కడప – పులివెందుల బైపాస్ రోడ్డులో ఇంటి నిర్మాణాలు ఉండడంతో పంచా యతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సొంత డబ్బులు ఖర్చు చేసి 3 నెలలు కింద పైపు లైన్ వేసుకున్నట్లు చెప్పారు. నీటి కుళాయిలకు రూ.50 వేలు డిపాజిట్ చేయడంతో పాటు పైపు లైన్ వేసేందుకు రూ.80 వేలు ఖర్చు చేశామన్నారు. 3 నెలలు పూర్తయినా తాగునీరు మాత్రం ఒక చుక్క రావడం లేదని తెలిపారు. మూడు నెలలకు గాను 3 సార్లు మాత్రమే తాగునీటిని పంచాయతీ సిబ్బంది సరఫరా చేశారని తెలిపారు. వేలాది రూపాయలు ఖర్చు చేసుకున్నా తాగునీటిని సరఫరా చేయక పోవడం ఏమిటని వారు పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. ప్రతి రోజూ రూ. 600 వందలు ఖర్చు పెట్టుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకొంటున్నట్లు చెప్పారు. త్రాగునీటిని సరఫరా చేయాలని సిబ్బందిని కోరితే పైపులు దెబ్బతిన్నాయి మరమ్మతులు చేయాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పుతున్నారని తెలిపారు. పాపాఘ్ని నదిలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ తాగునీరు సరఫరా చేయక పోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా తాగునీటిని సరఫరా చేయాలని పంచాయతీ అధికారులను వారు కోరారు.

అదనపు గదులు ప్రారంభం

దువ్వూరు : మండలం పుల్లారెడ్డిపేటలో శ్రీలక్ష్మీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో నూతన అదనపు తరగతి గదులను మంగళవారం డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి, శ్రీమన్నారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహాదారు ఓబుళ కొండారెడ్డి, ఎంపిపి జయచంద్రారెడ్డి, వైసిపి నాయకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

క్రీడలతో మానసిక వికాసం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

విద్యార్థులకు క్రీడలు మనోవికాసాన్ని కలిగిస్తాయని ఐసిటిసి కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా 6వ రోజు భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. వై . నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో వైఎస్‌విఆర్ఎం కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దత్తత గ్రామమైన బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యకర మైన సలహాలను వివరిస్తూ, క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిటిసి సభ్యులు బాదల్ వల్లి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు



వేంపల్లె: జగనన్న సురక్ష బ్యాగులు అందజేస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపిటి లక్ష్మయ్య సూచించారు. మండల పరిధిలోని బద్రిపల్లె ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల వైద్యాధికారులు రాజేష్ కుమార్, కావ్య మాధురి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిపి ప్రారంభించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళు లు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రతాప్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధికారి వెంట అసిస్టెంట్ మలేరియా అధికారి జి.వెంకటరెడ్డి పాల్గొన్నారు. **బి.కోడూరు :** మండలంలోని మున్నెలి గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. సుమారు 393 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో బి కోడూరు సొసైటీ ప్రెసిడెంట్ ఒ. ప్రభాకర్ రెడ్డి, ఎంపిపి ఒ. మాధవరెడ్డి, ఆరోగ్య మిత్ర సుధాకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది జాన్ విలియం, నాగేశ్వరరావు, 104 సిబ్బంది పాల్గొన్నారు. **ముద్దనూరు :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్ష అని ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం 3వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కరిష్మా, శ్రీకాంత్ ఆధ్వర్యంలో గైనకాలజీ, ఆప్తమాలజీ ప్రత్యేక వైద్య నిపుణులు కంటి, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వీరభద్రుడు, సూపర్ వైజర్ శోభాకుమారి, మహిళా పోలీసు ఆకాంక్ష, సిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె:** రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సిఎం జగన్ రెడ్డి లక్ష్యమని ఎంపిడిఒ సంపతి దివిజా, ఎంపిపి లక్ష్మి గాయత్రీ అన్నారు. మంగళవారం స్థానిక 4వ గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి మల్లికార్జున రెడ్డి, ఎంపిటిసిలు, వాలింటీర్ గౌస్, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో హక్కులను సాధిద్దాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



బద్వేల్: గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ పోరాట పటిమను జాతి ఐక్యతను, మత సామరస్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని హక్కుల కోసం యువత గళం విప్పాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్ తెలిపారు. మంగళవారం మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని డివైఎఫ్ ఐ ఆధ్వర్యంలో జమ్మలమడుగు లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో బిజెపి ప్రభుత్వం గాంధీ ఆశయాలకు తూట్లు పొడుస్తోందన్నారు. గాంధీని చంపిన గాడ్సే వారసులకు అందలం ఎక్కిస్తుందన్నారు. నేడు బిజెపి మతాల మధ్య,కులాల మధ్య వైర్యాలను సృష్టించి విభజిస్తుంది అన్నారు. గాంధీ స్ఫూర్తితో విభజన హామీల అమలు కోసం యువత పోరాటాలలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సూరి కృష్ణారెడ్డి శ్రీను రాఘవ పాల్గొన్నారు. **బద్వేలు :** స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ పోరాటాన్ని, జాతి ఐక్యత, మత సామరస్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని హక్కుల సాధన కోసం యువత గళం విప్పాలని, ఆయన స్ఫూర్తితో జిల్లాలో ఉక్కు పరిశ్రమను సాధించుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుమిత్ర నగర్ శాఖ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించడం జరిగింది కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్ పట్టణ నాయకులు జీవి రమణారెడ్డి, యువరాజ్, బాల గురయ్య, ఆంజనేయులు, నరసింహులు, ఇమ్మానియేలు, ఓబుల్ రెడ్డి, యూసఫ్ పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పులివెందుల పట్టణంలోని మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో, అలాగే ప్రభుత్వ కార్యాలయాలలో ఘనంగా వర్ధంతి వేడుకలను నిర్వహించారు. సందర్భంగా పలువురు మాట్లాడుతూ శాంతి, అహింస, సత్యంతో మహాత్మా గాంధీ అందరికీ ఆదర్శప్రాయుడని ఆయన జీవిత ఆశయాలను అందరూ కొనసాగించాలని పేర్కొన్నారు. **కమలాపురం :** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పెద్దచెప్పలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సర్ సి.వి రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ జీవితంపై ఛాయ చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేయడమైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. ఓబు ల్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి, అహింస, సత్యంతో మహాత్మా గాంధీ అందరికీ ఆదర్శప్రాయుడని ఆయన జీవిత ఆశయాలను అందరూ కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్. శ్రీనివాసుల రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, కడప డివిజన్ రామన్ సైన్స్ క్లబ్ అధ్యక్షులు తాను రూపొందించిన ఛాయాచిత్రాలను గాంధీజీ జీవిత సన్నివేశాలను విద్యార్థులందరికీ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర ప్రసాద్, సునీల్, ఝాన్సీ రాణి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. **చెన్నూరు : మండ**ల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మండల అధ్యక్షులు ఎంపిపి సురేష్ యాదవ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ మండల కన్వీనర్ జి ఎన్ భాస్కర్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులు సమర్పించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉద్యమంలో ఆయన సేవలో ఎనలేని కొనియాడారు . కార్యక్రమంలో నాయకులు పి రఘురాం రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు

మహనీయుల ఆశయాలను మరవకూడదు

ప్రజాశక్తి - బద్వేలు

హిందూ ముస్లిం సమైక్యత కోసం తపించిన మహనీయుల ఆశయాలను నెరవేర్చుతామని జైహో జాతీయ సభ్యులు గొల్లపల్లి గురవయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలో జైహోఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని అమ్మవారిశాల వద్దనున్న గాంధీ విగ్రహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. డిసెంబర్ 19 నుండి జనవరి 31 వరకు హిందూ ముస్లిం సమైక్యత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవాజ్ నాయకులు సత్తార్ మాట్లాడుతూ హిందూ ముస్లిం ఐక్యత కోసం జై భారత్, జైహో చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జై భారత్ జిల్లా అధ్యక్షులు అర్. ఓబయ్య, అన్వర్ బాషా,ఎం.శేఖర్ ,రత్నం వ.నాగభూషణం, డిబిఎఫ్ కార్యదర్శి చిన్నయ్య, గంగాధర్, పాములేటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పరిధిలోని నడింపల్లి–1వ బాలుర వసతి గృహంలో 10వ తరగతి విద్యార్థులకు మార్చిలో నిర్వహించబోయే పరీక్షలకు సన్నద్ధులు కావాలని ఎఎస్‌డబ్ల్యూఒ గురుప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి మొదటి మెట్టు అన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా క్రమశిక్షణతో, పట్టుదలతో బాగా చదవాలన్నారు. మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఎఎస్‌డబ్ల్యూఒ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులకు వసతి గృహాల్లో ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఎలా చదవాలి, ఎక్కువ మార్కులు వచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్స్ బ్రహ్మం, నాగరాజు, నాగరాజు నాయక్, వహీద్, బషీరా బేగం, శివలక్ష్మి, గురు జ్యోతి, అనిత, రామకృష్ణారెడ్డి, ట్యూటర్స్ గురువయ్య, సుందరం, యమున,నీలిమ,నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించాలి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి, చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమణారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. గతంలో కమిషనర్‌గా పనిచేసి చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన కమిషనర్ నరసింహారెడ్డిని పూలమాల, దుశ్శాలవాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కొత్తగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రమణారెడ్డిని మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వార్డుల్లో ఇంకా ఎక్కడైనా సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులు పెండింగ్‌లో ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఉన్న అంగన్వాడీ సెంటర్‌ను ప్రతిరోజు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమ లో వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

5 నుంచి ఉచిత డ్రైవింగ్ శిక్షణ

పులివెందుల రూరల్ : ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ శిబిరం జనరల్ మేనేజర్ బాల గురవప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి డ్రైవింగ్ లో ఉచిత శిక్షణ, జర్మనీలో ఉపాధి ముంబైకి చెందిన డిబి స్కిల్స్, ఐడియాస్ స్కిల్స్ సౌజన్యంతో పట్టణంలోని వైఎస్ఆర్ ఇస్తా ఆవరణలో ఇస్తారన్నారు. హెవీలైసెన్సు కల్గి, 40 ఏళ్లలోపు వయసు గల యువతీ యువకులకు ఉచితంగా 120 రోజుల శిక్షణ ఇస్తారని తెలిపారు. పూర్తి చేసిన వారికి జర్మనీ బాష నేర్పించి, జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశం రాష్ట్రంలోని ఏ ప్రాంతం వారైనా అర్హులే అని, ఆసక్తి గల యువతీ యువకులు 9966509364లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

నిరంతర కృషితోనే ఉన్నతశిఖరాలు

- ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ కె.హరినారాయణరెడ్డి

ప్రజాశక్తి - కడప సిటీ



నిరంతరకృషి, పట్టుదలలే ఉన్నత శిఖరాలకు చేరువ చేశాయని ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ హరినారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో తన ఉద్యోగ జీవితంలో ఎదురైన సవాళ్లు, అవకాశాలు, ఎదిగిన తీరుపై అంతరంగాన్ని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తూగుంట పల్లికి చెందిన నాగిరెడ్డి, సరోజమ్మ దంపతుల ఐదుగురిలో ఒకరిగా జన్మించానని తెలిపారు. జిల్లాలోని బాలంవారిపల్లిలో ప్రాథమిక, పీలేరు హైస్కూల్‌లో సెకెండరీ, అనంతరం 1980లో శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీలో ఇంజినీరింగ్‌లో ప్రథమశ్రేణిలో పూర్తి చేశానన్నారు.1985లో టిటిడి సాంకేతిక విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించానని తెలిపారు. 1986లో మదనపల్లి మున్సిపల్ కార్పొరేషన్, 1988లో ఇరిగేషన్‌లో అన్నమయ్య ప్రాజెక్టులోని చెయ్యేరు ప్రాజెక్టు డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ప్రస్థానం ప్రారంభించానని చెప్పారు. ఇదేసమయంలో రెడ్డివాణిని వివాహం చేసుకున్నాని చెప్పారు. తన ఇద్దరు పిల్లలు క ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. 1993 నుంచి 2006 వరకు బుగ్గవంక ప్రాజెక్టు డివిజన్, 1996 నుంచి 2007 వరకు చెయ్యేరు ప్రాజెక్టులో విధులు నిర్వహించానని తెలిపారు. అన్నమయ్య రిజర్వాయర్ నిర్మాణ సమయంలో క్రియాశీలక పాత్ర పోషించానని చెప్పారు. 2007 నుంచి 2009 వరకు మెకానికల్ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వహించానన్నారు. 21 ఏళ్లపాటు సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్‌గా పని చేశానని తెలిపారు. పెన్నానదిపై తలపెట్టిన ప్రాజె క్టు పనుల్లో చివరి వరకు క్రియాశీలక పాత్ర పోషించానన్నారు. 2009లో డిఇగా ఉద్యోగోన్నతి లభించిన అనంతరం మదనపల్లికు బదిలీపై వెళ్లానని తెలిపారు. 2009 నుంచి 2018 వరకు జలయజ్ఞం పనుల్ని పూర్తికి కృషి చేశానన్నారు. 2019 సెప్టెంబర్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతిపై నెల్లూరులో విధులు నిర్వహించానని తెలిపారు. 2020 మేలో తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించా నన్నారు. అన్న మయ్య రిజర్వాయర్, నెల్లూరు జిల్లాలోని సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీ నిర్మాణ పనుల్ని పూర్తి చేయడం తృప్తిని ఇచ్చిం దన్నారు. బ్యారేజీల నిర్మాణ పనుల్ని పూర్తి చేసిన నేపథ్యంలో ప్రతి పాత్మక కేంద్రీయ సంస్థ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ విభాగం సమీకృత జలవ నరుల విభాగంలో ఉత్తమ ప్రాజెక్టుగా ప్రక టించి, కలెక్టర్, చీఫ్‌ఇంజినీర్లను ఢిల్లీలో అవార్డును అంద జేశారని తెలిపారు. 2020లో సోమశిల జలాశయాన్ని 78 టిఎంసిలను, కండలేరులో 60 టిఎంసిలను నిల్వ చేశానని తెలిపారు. 2019–20 సంవత్సరాల్లో 2.72 లక్షల ఎకరాలకు సాగునీరు అందించానని చెప్పారు. కండలేరు చరిత్రలో లేట్ ఖరీఫ్ కాలంలో అత్యధికంగా 2,73,500 ఎకరాల్లో సాగు చేసిన రికార్డు నెలకొల్పా నని తెలిపారు. చెన్నయ్ తాగునీటి అవసరాల నిమిత్తం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 8.115 టిఎంసిలను నీరు సరఫరా చేశానని తెలిపారు. 2023 ఫిబ్రవరిలో కడప చీఫ్ ఇంజినీర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టానన్నారు. కడప చీఫ్ ఇంజినీర్ పరిధిలో హంద్రీ నీవా, గాలేరు–నగరి ఎత్తిపోతల పనుల్ని వేగవంతం చేశానని తెలిపారు. కొకు రిజర్వాయర్ నుంచి గండికోట రిజర్వాయర్‌ను కలిపే వరద కాలువ, టన్నెల్ సామర్థ్యాన్ని 20 వేల క్యూసెక్కుల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెంచే పనిని 60 శాతం మేర పూర్తి చేశానని తెలిపారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, గండికోట రిజర్వా యర్లను పూర్తి సామర్థ్యంతో నింపి సాగునీరు, తాగునీటి అవసరాల మేరకు నీటిని నిల్వ చేశానని తెలిపారు. పులివెందుల బ్రాంచ్ కెనాల్, మైక్రో ఇరిగేషన్‌ని అభివృద్ధి చేసి పులివెందుల ఏరియా డెవలప్ మెంట్ ఏజెన్సీతో కృషి చేశానని తెలిపారు.



షూటింగ్ చిత్రీకరణ ఏర్పాట్లలో యూనిట్ సభ్యులు

ఎర్రగుంట్లలో రజనీకాంత్ సినిమా చిత్రీకరణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న తమిళ చిత్రం వెట్టయాన్ చిత్రీకరణ ఎర్రగుంట్ల పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. రెండు రోజులుగా నిర్వహిస్తున్న చిత్రీకరణ కోసం సూపర్‌స్టార్ రజనీకాంత్ ఎర్రగుంట్లకు చేరుకున్నారు. స్థానిక నిడుజివ్వి గ్రామం వద్దనున్న నాపరాయి క్వారీలలో ఫైట్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. చిత్ర బృందం సోమవారం నాడే నాపరాయి క్వారీ వద్దకు చేరుకొని సన్నివేశానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం నుంచి హీరో రజనీకాంత్‌కు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. రెండు రోజులపాటు చిత్రీకరణ జరుగుతుందని, ఒక సన్నివేశాన్ని స్థానిక సిమెంట్ కర్మాగారంలోని మైన్స్‌లో తీయనన్నట్లు సమాచారం. ఈ సినిమాను లైకా ప్రొడక్షన్స్ సారథ్యంలో జ్ఞానవేల్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. రజనీకాంత్, చిత్ర బృందానికి స్థానిక సిమెంట్ పరిశ్రమలో విడిది ఏర్పాట్లు చేశారు. సినిమా షూటింగ్ నిమిత్తం రజనీకాంత్ వచ్చాడనే సమాచారం తెలియడంతో ఆయన్ను చూడటానికి ప్రజలు తండోపతండాలుగా షూటింగ్ ప్రాంతానికి చేరుకున్నారు. స్థానిక పోలీసులు, రజనీకాంత్ సెక్యూరిటీ సిబ్బంది ప్రాంతం వైపు ఎవరిని వెళ్లకుండా నిలువరించారు.

పెండింగ్ మెస్ బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కడప

పెండింగ్‌లో ఉన్న మెస్‌బిల్లులను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జి సి.పి.నాగేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు ఐదు నెలలుగా మెస్ ఛార్జిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో గురుకుల వసతి గృహాలు చదువుతున్న విద్యార్థులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయం హాస్టల్ విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు ప్రకాష్, కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

టిడిపి మైనార్టీ కార్యదర్శిగా ఫయాజ్

ప్రజాశక్తి - వేంపల్లె

మండల టిడిపి మైనార్టీ కార్యదర్శిగా ఫయాజ్‌ను, బిసి మండల ఉపాధ్యక్షులుగా మడక శ్రీనివాసులును నియమించినట్లు మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఫయాజ్‌కు, మడక శ్రీనివాసులుకు రైతు విభాగం జిల్లా అధ్యక్షులు బాలస్వామిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారిని గుర్తించి పార్టీ పదవులు ఇచ్చినట్లు చెప్పారు. కార్యకర్తలు మరింత ఉత్సాహంతో రాబోవు ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, రామసుబ్బారెడ్డి, వీరబద్ర, పాపిరెడ్డి, గోగుల మల్లికార్జున, డాక్టర్ కరీముల్లా, సయ్యద్ పీరా, ఇలియాస్, మహబూబ్ షరీఫ్, వెంకటయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కలసపాడు : మండలంలోని ఆర్‌సిఎం చర్చి కాలనీ వద్దనున్న పునీత యోహాను చర్చి రెండవ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పేదలకు ఫాదర్ కొత్తపల్లె మనోహర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి

కలసపాడు : మండలంలో రూ. 30 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పనులను యుద్ధ ప్రాతిపదికన త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ మహబూబ్‌బీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కాంట్రాక్టర్ రాంబాబుతో కలిసి మాట్లాడారు. ఇంతవరకు మండలంలో పంచాయతీ నిధులు కొరత ఉన్నందున అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె తెలిపారు ప్రస్తుతం మంజూరైన నిధులతో డ్రెయినేజీ పనులు చేపట్టామని, త్వరలో పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించామని చెప్పారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మురారి, రాంబాబు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

చాపాడు : వివక్షతను ముగిద్దాం – గౌరవాన్ని స్వాగతిద్దాం అనే నినాదంతో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తామని చాపాడు వైద్యాధికారులు డాక్టర్ రాజేష్ కుమార్ తెలియజేశారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రంగు మారిన మచ్చలు ,పొడలు, లావుగా మారిన లేక నొప్పితో కూడిన నరాలు, వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, డాక్టర్ కావ్య మాధురి, బద్రిపల్లె సర్పంచ్ భర్త గుత్తి నారాయణ, సిహెచ్ఒ మహాదేవయాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, ఆశ నోడల్ పర్సన్ సుకన్య, సూపర్ వైజర్ సరస్వతి, ఎఎన్ఎంలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చెన్నూరుకు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : మండలానికి కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజనేయులు ఓబులంపల్లి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, రామన్ పల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ ప్రారంభోత్సవం చేస్తారని అటవీశాఖ డైరెక్టర్, కమలాపురం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు రమణ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపిపి, జడ్‌పిటిసి సర్పంచులు, ప్రజలు, అధికారులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

అధ్యాపకులు శ్రీకాంత్‌రెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి-వేంపల్లె

స్థానిక వైఎస్‌ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డికి డాక్టరేట్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ప్రొఫెసర్ బిపిఎస్ చౌహన్ పర్యవేక్షణలో శ్రీకాంత్ రెడ్డి 'అవిశ గింజలు.. ముడత తెగులు'పై పరిశోధన చేసినట్లు చెప్పారు. అవిశీ గింజలలో వచ్చే ముడత తెగులు నివారణ పద్ధతులపై చేసిన కృషికి గాను యూనివర్సిటీ శ్రీకాంత్ రెడ్డికి డాక్టరేట్ ఇచ్చినట్లు చెప్పారు. ఆయనకు డాక్టరేట్ రావడంపై కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్రతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.